క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఏపీఓ వెంకటేశ్వర్లు శుక్రవారం హాజీపురంలో పరిశీలించారు. ముందుగా కూలీల మస్టర్లు, హాజరు శాతం పరిశీలించారు. పనికి రాని వారికి మస్టలు వేసిన మేట్లపై, ఎఫ్ఏపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడి లాంటివి

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మ ఒడి లాంటివని ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, సూపర్‌వైజర్ యం.వి.ఎస్.పార్వతి అన్నారు. రావిగుంటపల్లెలో శుక్రవారం జనభాగీ దారీ కార్యక్రమం నిర్వహించారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సువారిని అంగన్‌వాడీ కేంద్రాలకు విధిగా పంపాలన్నారు. వైద్య సిబ్బంది నదియా, ఎ.మంజుల, వెంకట్రావు, నాగేంద్రమ్మ, సుహాసిని పాల్గొన్నారు.

98 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మిట్టపాలెంలో డాక్టర్ ప్రతాప్ రెడ్డి 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంల, ప్రాథమిక పాఠశాలోపరీక్షలు నిర్వహించారు. షేక్ మస్తాన్, డేవిడ్, ఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా ఓ వరం

పీసీపల్లి: వైఎస్సార్ పశువుల బీమా పథకం పశుపోషకులకు వరంలాంటిదని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ పి.వెంకటసుబ్బయ్య అన్నారు. పెద ఇర్లపాడులో శుక్రవారం వైఎస్సార్ పశువుల బీమా పథకంపై పశుపోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాడిపశువులు, ఆవులు, గొర్రెలు, మేకలు తదితర జీవాలు రోగాలవల్ల, రోడ్డుప్రమాదం, పాముకాటు, ప్రకృతి వైపరీత్యాల వల్ల మృతి చెందితే బీమా పొందవచ్చన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



నామినీకి నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

పీసీపల్లి: యువతి నామినీ అయిన తల్లికి వైఎస్సార్ బీమా నగదు అందజేశారు. మిట్టమీదపల్లికి చెందిన కోటపాటి ప్రమీల (34)కొన్ని రోజుల క్రితం జ్వరంతో మృతిచెందింది. కాగా నామినీ అయిన తల్లి నాగమ్మకు శుక్రవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజశేఖర్ రెడ్డి మట్టి ఖర్చుల కింద మంజూరైన రూ.10000 అందజేశారు. తరువాత రూ.90వేలు వస్తాయన్నారు.

ఉపాధి పథకానికి 2 లక్షల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి మాల్యాద్రి

పామూరు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి గాను ఏడాదికి రూ .2 లక్షల కోట్లు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. బొట్లగూడూరు, అయ్యవారిపల్లి, అయ్యన్నకోట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీల కష్టాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వరంలాంటి ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. మెడికల్‌కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.మాలకొండయ్య, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు చుక్కల భూముల పత్రాల అందజేత

లింగసముద్రం: మండలంలోని మొగిలిచర్లలో చుక్కల భూములను ప్రభుత్వం క్రమబద్ధీకరించడంతో వాటి పత్రాలను అందజేసే కార్యక్రమం శనివారం నిర్వహించనున్నారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ శోభిక హాజరవుతారని తహసీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

మర్రిపూడి: మండలంలోని గార్లపేట గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.అంకమ్మరావు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని, పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరి రూరల్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు సెంటర్ కోఆర్డినేటర్ నరేష్ రాజా శుక్రవారం తెలిపారు. ఆగస్టు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



కరవది జెడ్పీ హైస్కూలు



మంచినీటి కుళాయిలు

అక్షరాల తోటలుగా విద్యాలయాలు

- కార్పొరేట్ పాఠశాలలను తలదన్నుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- నాడు–నేడుతో రూపురేఖలు మారిన వైనం

ఒంగోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పునకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నాడు–నేడు పథకం ద్వారా విద్యాలయాల మార్పు సాధ్యమైంది. ఒంగోలు రూరల్ మండలంలో మొదటి దశలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు 9 పాఠశాలలు రూపురేఖలే మారిపోయాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు పంపాలంటే చిన్నతనంగా భావించే తల్లిదండ్రులు నేడు ఆ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌ల కోసం సిఫార్సు చేయించుకోవడం విశేషం. పాఠశాలల వద్ద నోఅడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసిన వైనం గత విద్యా సంవత్సరంలో చోటు చేసుకుంది. మొదటి దశ నాడు–నేడు పథకంలో భాగంగా మండలంలో 9 పాఠశాలలు ఎంపిక రాగా.. అందులో కరవది జిల్లా పరిషత్ హైస్కూలు, గుండాయపాలెం యూపీ స్కూలు, ఆరు ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. వీటికి రూ.3 కోట్లతో రీమోడలింగ్, నూతన భవనాల నిర్మాణం, తరగతి గదుల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, బాత్‌రూమ్స్, వంట గది, డైనింగ్ హాల్ నిర్మాణాలు చేపట్టారు.

అప్‌గ్రేడ్ అయిన కరవది జెడ్పీ హైస్కూల్

ప్రస్తుతం కరవది జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒంగోలు మండల విద్యాధికారి కిషోర్‌బాబు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తిచేయడం ద్వారాలు, కిటికీలు, బెంచ్‌ల ఏర్పాటు, గదులకు లైటింగ్ సిస్టం, ఫ్యానులు అమర్చారు. మరుగుదొడ్ల రూపురేఖలు మార్చివేసి డైనింగ్ హాలుగా ఏర్పాటు చేశారు. అదనపు గదులు రావడంతో.. రాష్ట్ర ప్రభుత్వం కరవది హైస్కూలు ను బాలికల జూనియర్ కళాశాలగా బాలినేని సిఫార్సు మేరకు అప్‌గ్రేడు చేసింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో గత సంవత్సరం సెక్షన్‌కు 30 మంది బాలికలు అడ్మిషన్లు పొందారు.

హైస్కూల్‌గా మారిన గుండాయపాలెం యూపీఎస్

ఇదే కోవలో అప్పర్‌ప్రైమరీ గా ఉన్న గుండాయపాలెం పాఠశాల నాడు–నేడు పథకంతో ఆదర్శ పాఠశాలగా రూపుదిద్దుకుంది. అప్పటి జాయింట్ డైరెక్టర్ (విద్యాశాఖ) పార్వతి గుండాయపాలెం పాఠశాలను సందర్శించి పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాఠశాల హెచ్ఎం అంకితభావంతో చేసిన అభివృద్ధి పనులు అభినందించారు. అదనపు తరగతి గదుల ఏర్పాటు, పవర్‌హెడ్ ట్యాంక్, లైటింగ్, ఆధునిక సీలింగ్, విద్యార్థులకు ఫైన్లు, ల్యాబ్, కంప్యూటర్ రూం ఏర్పాటు చేశారు. దీంతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని సిఫార్సు మేరకు గత సంవత్సరం 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ కావడంతో 10వ తరగతి పరీక్షలు కూడా రాశారు.

మారిన ప్రాథమిక పాఠశాలలు

అలాగే 6 ప్రాథమిక పాఠశాలల్లో రూపురేఖలు మారిపోయి విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ఈ సంవత్సరం రెండో దశ నాడు–నేడు పథకంలో 21 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఉలిచి, త్రోవగుంట, ముక్తినూతలపాడు హైస్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ప్రాథమిక పాఠశాలలు 15 ఎంపికయ్యాయి. ఇంజినీరింగ్ విభాగం వారు ఐదు కోట్ల నలభై లక్షలు అంచనా వేశారు. ప్రస్తుతం రెండో దశ పనులు వేగంగా జరుగుతున్నాయి. మరి కొద్ది నెలల్లో ఈ 21 పాఠశాలల్లో నాడు–నేడు రెండో దశ పనులు పూర్తయితే ఒంగోలు రూరల్ మండలంలోని విద్యా విషయక వ్యవహారాల్లో ప్రథమ స్థానంలో ఉంటుందనడంలో సందేహం లేదు.



గుండాయపాలెం పాఠశాల దృశ్యం

జగనన్న కిట్లతో జోష్



ఇప్పటికే జగనన్న కిట్లు పంపిణీతో విద్యార్థులకు యూనిఫాం, షూలు, బెల్టులు, బ్యాగులు అందజేసి ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఓ స్థాయిని తీసుకొచ్చింది. ఇంగ్లిషు మీడియం, తెలుగు మీడియం ఒకే పాఠ్యాంశాల్లో ముద్రించి విద్యార్థులకు అవగాహన, బోధన సులభతరం చేసింది. నాడు–నేడు తో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలను దాటి గర్వంగా నిలబడ్డాయి. ఈసందర్భంగా ఒంగోలు ఎంఈఓ కిషోర్ బాబు మాట్లాడుతూ ఒంగోలు మండలంలో పనిచేయడం తనకెంతో తృప్తిని కలుగజేస్తోందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవ, సలహాల మేరకు పాఠశాలల అభివృద్ధి వేగంగా జరిగిందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల, గ్రామ పెద్దల సహకారం ఉందన్నారు.

మండల విద్యాధికారి: కిషోర్‌బాబు

పేదల చదువుపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి



కిట్లు అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: పేదల చదువుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. త్రోవగుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మూడు జతల యూనిఫాం అందిస్తున్నట్లు వివరించారు. అలాగే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, బెల్టులు, స్కూలు బ్యాగ్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కింద ఇస్తున్న ఈ కిట్లు ఇవ్వటం ద్వారా పేదల పిల్లలు చదువుపై దృష్టి సారించేందుకేనన్నారు. స్థానిక కార్పొరేటర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపు లైన్ల పరిశీలన



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు, డీఈ చంద్రశేఖర్

ఆలూరు (కొత్తపట్నం): గుళ్ళకమ్మ నది నుంచి ఆలూరు పైపులైన్లు పగిలిపోవడంతో ఆర్‌డబ్ల్యూస్ ఈఈ ఎం.శ్రీనివాసులు, డీఈ టి.చంద్రశేఖర్, ఎస్ మహేంద్రరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆరు నెలలు క్రితం పైపులు పగిలిపోయి నీరు రావటం లేదని తాగు నీరుకు ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఇటీవల ఆలూరు, గాదెపాలెం గ్రామస్తులు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసికెళ్లారు. దీంతో ఆయనడ్డి ఆదేశాల మేరకు అధికారులు పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతి భర్త రాజుగోపాల్‌రెడ్డి, పల్లప్రోలు జానికరామిరెడ్డి, జి.సురేష్‌రెడ్డి, గ్రామస్తులున్నారు.

పౌరాణిక నాటక రంగం గొప్పది



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: సకళ కళల సమాహారమే నాటకమని, నేటి ఆధునిక సాంకేతిక యుగంలో కూడా పౌరాణిక నాటక రంగం బలోపేతానికి నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న కషి అభినందనీయమని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు అన్నారు. నాగినేని నరసింహారావు 12వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈనెల 18న నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో దేవ నర్తకి నుంచి ఓ ఘట్టాన్ని, చిలకమర్తి గయోపాఖ్యనం నుంచి యుద్ధ ఘట్టాన్ని, బలిజేపల్లి సత్యహరిశ్చంద్రుడు నాటకం నుంచి వారణాసి ఘట్టాన్ని ప్రదర్శించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మిడలస మల్లికార్జునరావు, కనుమాల రామారావు తెలిపారు. అతిరథ మహారథులు హాజరుకానున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కుర్రా ప్రసాద్‌బాబు, చిడితోటి బాబురావు, కొప్పోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైజ్‌లో కౌన్సెలింగ్‌పై అవగాహన

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీల యువతకు కెరీర్ కౌన్సిలింగ్‌పై జిల్లా సెట్ప్ అధికారులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోటివేటర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటూ ఇప్పటి నుంచే ఉద్యోగ సముపార్జనకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. తమ ఉజ్వల భవిష్యతను కాంక్షించుకుంటూ సోపానాలను నిర్మించుకోవాలన్నారు. సెట్ప్ మేనేజర్ పువ్వాడ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ జాతీయ యువజన పాలసీలో భాగంగా సెట్ప్ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. గమ్యాన్ని నిర్ణయించుకుంటూ నైపుణ్యాలను పెంచుకుని భవిష్యత్తులో ఎంత ఎత్తుకు ఎదిగి ప్రతి ఒక్కరు ఒక పారిశ్రామిక వేత్తగా, మంచి వ్యాపారవేత్తగా, మంచి ఉద్యోగాన్ని సంపాదించుకునేందుకు దినచర్యను ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంపత్, రైజ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి



వలేటివారిపాలెంలో చెరువుని పరిశీలిస్తున్న ఎంపీడీవో అజిత



కరవదిలో జగనన్న లేఅవుట్లలో శంకు స్థాపన చేస్తున్న ఎంపీడీవో, డీఈ

ఒంగోలు రూరల్: గ్రామాల అభివృద్ధి కోసం సచివాలయ సిబ్బంది పనిచేయాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. వలేటివారిపాలెం సచివాలయం శుక్రవారం తనిఖీ చేశారు. రైతు భరోసా, సబ్ సెంటర్ కార్యాలయ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. లక్షలాదిగా ఉన్న వివిధ రంగాలకు చెందిన నిరుద్యోగులకు సచివాలయ వ్యవస్థ ద్వారా శాశ్వత ఉద్యోగ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే సబ్‌సెంటర్‌ను, రైతు భరోసా కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, తాగునీటి చెరువును, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఫిల్టర్‌బెడ్ పరిశీలించారు. గ్రామ కార్యదర్శి రంగారెడ్డి, పూర్వ వైస్ ఎంపీపీ ఎస్.రాఘవరావు, సచివాలయ సిబ్బంది హేమలత, రమీజ్, మెడికల్ సిబ్బంది భారతి, కృష్ణవేణి, జయ పాల్గొన్నారు.

కరవదిలో..

కరవదిలో జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. డీఈ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం చేపట్టనున్న గృహాలకు మ్యాపింగ్, శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఏఈ పృథ్వీ, గ్రామ కార్యదర్శులు నారాయణకుమార్, వేమా శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మణికంఠా, రమీజ్, కాంట్రాక్టర్ శేషారావు పాల్గొన్నారు.

మూడు బుట్టల్లో చెత్త అందించాలి



38వ డివిజన్‌లో పరిశీలిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని మురుగు నిల్వ ఉండకూడదని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం 34వ డివిజన్‌లో చెత్త సేకరణ తీరును పరిశీలించారు. కార్మికులకు, క్లాప్ ఆటోలకు మూడు బుట్టల ద్వారా చెత్తను అందించాలని ఎందుకు వాటిని సద్వినియోగం చేసుకోవటం లేదని స్థానికులను ప్రశ్నించారు. కొంతమంది ఇంటి యజమానులు చెత్తను కవర్లలో చుట్టి మురుగు కాలువల్లో పడేస్తున్నారని, ఇది నేరమన్నారు. అలా చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ



జేవీకే కిట్‌లను అందిస్తున్న సర్పంచ్ పుల్లగూర రమణమ్మ

చీమకుర్తి: రాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక సర్పంచ్ పుల్లగూర రమణమ్మ చేతుల మీదుగా శుక్రవారం జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జేవీకే కిట్ల ద్వారా విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, షూస్, స్కూలు బ్యాగ్, పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో చదువును అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి



కీర్తిపాడులో పులగర కోటయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో పార్టీ నాయకులు

- పార్టీ కార్యకర్తలను కోల్పోవడం బాధాకరమన్న ఎమ్మెల్యే టీజేఆర్

మద్దిపాడు: వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి వృద్ధాప్యంతో మృతిచెందిన కార్యకర్తలకు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నివాళులర్పించారు. కీర్తిపాడు గ్రామానికి చెందిన పులగర కోటయ్య (84) ఎస్‌సీ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరక్టర్‌గా పదవీ విరమణ చేసి చాలాకాలంగా పార్టీకి మంచి సేవలు చేశారని కొనియాడారు. ఆయన మృతి చెందడం పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఎప్పుడూ పార్టీ కోటయ్య కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. అనంతరం మల్లవరం గ్రామంలోని చలంచర్ల కృష్ణారెడ్డి తండ్రి వెంకటేశ్వరరెడ్డి ఈ ఉదయం మరణించడంతో ఆయన మల్లవరం చేరుకుని కృష్ణారెడ్డిని పరామర్శించి వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, మోరబోయిన సంజీవరావు, రాయపాటి రమేష్, పిట్టల ఆంజనేయులు, గుడ్డపాతల రవి, తిప్పారెడ్డి కోటిరెడ్డి, నారా సుబ్బారెడ్డి, రావూరి వెంకటేశ్వర్లు తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగంపై నిబద్ధత కలిగి ఉండాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి



బదిలీ పై వెళుతున్న డీఏను సన్మానిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో సర్పంచ్ ఏడుకొండలు

మద్దిపాడు: ఉద్యోగులు తమ విధుల పట్ల నిబద్ధత కలిగి ఉండాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెన్నపూస భాగ్యలక్ష్మి బదిలీపై పొదిలి మండలం ఆముదాలపల్లి సచివాలయానికి వెళుతున్న క్రమంలో సచివాలయ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగం పట్ల నిబద్ధత కలిగి ఉన్న భాగ్యలక్ష్మి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. భాగ్యలక్ష్మి సేవలను ఆమె కొనియాడారు. అనంతరం శాలువా కప్పి వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో వారి వెంట గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, అనిల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి గృహం పూర్తి చేయాలి



జగనన్న లేఅవుట్లును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీఓ సుజాత

అల్లూరు (కొత్తపట్నం): గృహాలు అసంపూర్తిగా ఉండటానికి వీలులేదని ప్రతి గృహం పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలని మండల ప్రత్యేక అధికారి అర్చన పేర్కొన్నారు. అల్లూరులోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. గృహాలు పూర్తి చేయటానికి ఉన్న ఇబ్బందులు తెలుసుకున్నారు. మీరు ఇళ్లు నిర్మించుకోలేకపోతే కాంట్రాక్టర్ సహకారంతో ఇళ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఆర్‌కాలనీ, అరుంధతి కాలనీల్లో 383 మంది లబ్ధిదారులుకు గాను 233 గృహాలు వివిధ దశలో ఉన్నాయని 150 మంది లబ్ధిదారులు అసలు పారంభించలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉంటే డ్వాక్రా గ్రూపుల నుంచి లోన్లు తీసుకోవచ్చుని, మీపట్టా తనఖా పెట్టి బ్యాంక్ ద్వారా ఈఎంఐ రూపంలో తీసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు ఇళ్లు నిర్మించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో పి.సుజాత, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్ల రెడ్డి, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, హిమబిందు, వీఆర్వో ప్రవీణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రంగనాథ్, అశోక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆశాలత, వీవోఏలు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు తయారు చేయండి



మొక్కలు నాటుతున్న అర్చన, సుజాత

అల్లూరు (కొత్తపట్నం): ప్రతి చెత్త సంపద తయారి కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించాలని మండల ప్రత్యేక అధికారి అర్చన కోరారు. కాఫీ విత్ క్లాప్ మిత్ర ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. క్లాప్ మిత్రలతో మాట్లాడుతూ ఇంటిలో నుంచి తడి, పొడి చెత్త తీసుకొచ్చే విధంగా మహిళలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను ఇంటి యజమానులు రిక్షాలో వేయాలని కోరారు. వర్మీ కంపోస్టు తయారి చేసి కేజీ, రెండు కేజీల ప్యాకెట్లుగా విక్రయించాలని ఆదేశించారు. నీరునిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టి లార్వాలు, దోమలుగా మారి దోమకాటు గురవుతారన్నారు. తద్వార ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. చెత్త సంపద తయారీ కేంద్రంలో తీగ జాతి మొక్కలు పెంచడం వలన ఉష్ణోగ్రతలు తగ్గి వానపాములు చనిపోకుండా ఉంటాయని తెలిపారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, హిమబిందు, సిచివాలయం సిబ్బంది విజయ్‌లత, రంగనాథ్, అశోక్, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోండి

ఒంగోలు: జిల్లాలోని హోటళ్ల, రెస్టారెంట్లు, ట్రావెల్ ఏజెంట్లు తమ సంస్థలను టూరిజం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎపిటూరిజం.జీవోవి.ఇన్ లో రిజిస్టర్ చేసుకోవాలని విజయవాడ ఏపీ టూరిజం సీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్టర్ ప్రక్రియ ఈనెల 25వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. ఒకసారి రూ. 500 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకుంటే 3 సంవత్సరాలవరకు మరలా ఎటువంటి ఫీజు ఉండదన్నారు. రిజిస్టర్ చేసుకున్న నాలుగు రోజులలో టూరిజం శాఖ నుంచి సర్టిఫికెట్ వస్తుందని, కనుక అందరు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం విజయవాడ టూరిజం కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లాజ్వంత్ నాయుడు సెల్ నెంబర్ 9560302929 నంబర్‌ను సంప్రదించాలన్నారు.